ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 22.0
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
గురువారం 21 ఆగస్టు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	583.70 (293.6854)	4,85,872	4,78,384
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.37 (3.78)	8,059	9,561
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	165.35 (32.0877)	4,32,639	4,62,845

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220

ముందస్తుగానే

మద్యం టెండర్లు



- దుకాణాల లైసెన్స్ జారీకి ప్రభుత్వం ఖరారు
- ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా..
- దరఖాస్తు ఫీజును రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు పెంపు
- గతంలో మాదిరిగానే మద్యం దుకాణాలకు రిజర్వేషన్లు

మద్యం దుకాణాలకు లైసెన్స్ జారీకి ప్రభుత్వం నిర్ణయించింది. వాస్తవానికి మద్యం షాపుల టెండర్ల గడువు 2025 నవంబరు నెలతో ముగుస్తుంది. అయితే ముందస్తుగానే ప్రభుత్వ ఖజానా నింపుకునేందుకు రెండునెలల గడువు ఉండగా..., ముందస్తుగానే టెండర్ల ప్రక్రియను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. మద్యం దుకాణాలకు 2025-27 నవంబరు వరకు రెండేళ్ల కోసం లైసెన్స్‌లు జారీ చేయనుంది. దుకాణాల కేటాయింపులో గతంలో మాదిరిగానే రిజర్వేషన్లు కల్పించింది. 15 శాతం గౌడ్‌లకు, 10శాతం ఎస్సీలకు, 5 శాతం ఎస్టీలకు రిజర్వేషన్లు ఉండనున్నాయి. ఆరు స్లాబ్‌ల ద్వారా లైసెన్స్‌లు జారీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో వెల్లడించింది.

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

జిల్లాలో మొత్తం 82 మద్యం దుకాణాలు ఉన్నాయి. జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో మద్యం దుకాణాలు కొనసాగుతున్నాయి. వీటిలో భువనగిరి స్టేషన్ పరిధిలో 27, రామన్నపేట స్టేషన్ పరిధిలో 18, ఆలేరు స్టేషన్ పరిధిలో 22, మోత్కూరు స్టేషన్ పరిధిలో 15 మద్యం దుకాణాలు ఉన్నాయి. జిల్లా యంత్రాంగం 2025-27 సంవత్సరాలకి సంబంధించిన లైసెన్స్ కోసం గెజిట్ నోటిఫికేషన్‌ను త్వరలోనే జిల్లాయంత్రాంగం జారీ చేయనుంది. ఈసారి కూడా ముందస్తుగానే మద్యం టెండర్లు వేస్తారని వ్యాపారులు అంచనావేశారు. వారు ఊహించిన విధంగానే గత ప్రభుత్వం మాదిరిగానే ముందస్తు టెండర్లకు సిద్ధమైంది. గతంలో (2023 సంవత్సరానికి ముందు) ప్రభుత్వాలు లైసెన్సుల గడువు ముగిసినప్పటికీ, కొన్నిరోజులపాటు తేదీ పొడిగిస్తూ, ఎలాంటి హడావుడి లేకుండా టెండర్లు నిర్వహించేది. అయితే మరోరెండు నెలలపాటు గడువు ఉండగానే ముందస్తు టెండర్లకు సన్నాహాలు చేస్తున్నారు. గడువు ముగియక ముందే టెండర్లు వేసి..., వ్యాపారులు మద్యం దుకాణాలు దక్కించుకున్నప్పటికీ, రెండునెలల వరకు వారు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉండనుంది.

రిజర్వేషన్ కేటగిరీలో 29 దుకాణాల కేటాయింపు

జిల్లాలో 2023లో మద్యం దుకాణాల రిజర్వేషన్ల కేటాయింపులో భాగంగా జిల్లాలో మొత్తం 82 మద్యం దుకాణాలుండగా, రాష్ట్రం యూనిట్‌గా నిర్వహించినడ్రాలో 29షాపులు ఆయా సామాజిక వర్గాలకు కేటాయించారు. జిల్లాలో గౌడ్‌లకు 15శాతం (21 దుకాణాలు), ఎస్సీలకు 10శాతం (7 దుకాణాలు), ఎస్టీలకు 5శాతం (ఒక దుకాణం) కేటాయించారు. గౌడ సామాజికవర్గానికి జిల్లాలోని రాయిగిరి, అనాజిపూర్, చీకటిమామిడి-2, పోచంపల్లి-1, బట్టుగూడం, బొమ్మలరామారం, పిలాయిపల్లి, చౌటుప్పల్-2,3,5, సంస్థాన్‌నారాయణపురం-1, 2, సర్వేల్, యాదగిరిగుట్ట-1,2,5, ఆలేరు-2,3,4ముత్తిరెడ్డిగూడెం, మాదాపూర్ దుకాణాలను కేటాయించారు. ఎస్సీ రిజర్వేషన్‌లో మరియాల, జూలూరు, చాడ, రాజాపేట-1, రుస్తాపూర్, గుండాల-1,2, ఎస్టీ కేటగిరిలో ఏకైక దుకాణం భువనగిరి మున్సిపల్ హెచ్‌బీ కాలనీ ఎదురుగా ఉన్న 8వ నెంబర్ దుకాణం, మిగతా 53 దుకాణాలు జనరల్ కేటగిరీలో ఉన్నాయి. ఈసారి కూడా గతంలో మాదిరిగానే రిజర్వేషన్లు కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దుకాణాలు ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటాయా వేచి చూడాల్సిందే.



భారీ ఆదాయమే లక్ష్యం

జిల్లాలోని 82 మద్యం దుకాణాల వేలంతో రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం లభించనుంది. జిల్లాలోని 82 మద్యం దుకాణాలకుగానూ... 16 దుకాణాలు సంవత్సరానికి రూ.60లక్షలు. 46దుకాణాలు రూ.55లక్షలు, 20 దుకాణాలు రూ.50లక్షల స్లాబ్‌లను నిర్ణయించింది. గత సంవత్సరం ఈ దుకాణాల ద్వారా సంవత్సర ఆదాయం రూ.44.90 కోట్లు, లైసెన్స్ కాల పరిమితైన రెండేళ్లకు రూ.89.80 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. అయితే గత సంవత్సరం దరఖాస్తు ఫీజును రూ.2లక్షల వరకు కేటాయించగా, ఈ సారి రూ.3లక్షలకు పెంచింది. తిరిగి చెల్లించబడని దరఖాస్తుల ఫీజు కూడా భారీగా రానుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ సారి దరఖాస్తులు గతం కంటే అధికంగా వచ్చే అవకాశాలు ఉండటంతో ఆదాయం కూడా పెరుగనుంది.

భువనగిరి ఖిల్లా అభివృద్ధికి

రూ.53 కోట్లు

- అభివృద్ధి పనులపై స్పష్టత
- రెండు ప్యాకేజీలుగా టెండర్లు

భువనగిరి టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): చారిత్రక భువనగిరి ఖిల్లా నూతన సొబగుల పనుల ప్రక్రియకు శతశాతం స్పష్టత వచ్చింది. అంతేగాక చేపట్టే అభివృద్ధి పనుల మౌలిక వసతుల పనులు కూడా ప్రారంభమయ్యాయి. వచ్చే సంవత్సరం మార్చి వరకు ప్రతిపాదిత పనులన్నీ పూర్తి చేయాలని సోమవారం హైదరాబాద్‌లో జరిగిన పర్యాటక శాఖ ఉన్నత స్థాయి సమావేశం నిర్ణయించింది. ఈమేరకు పర్యాటక శాఖ ఇంజనీరింగ్ భాగం అధికారులు మంగళవారం భువనగిరి ఖిల్లాను పరిశీలించారు. పనులు దక్కించుకున్న ఏజెన్సీ చదును పనులను కూడా ప్రారంభించింది. స్వదేశీ దర్శన్ 2.0కింద చేపడుతున్న అభివృద్ధి పనుల్లో మొదటిదఫాగా సుమారు రూ.56కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రధాని నరేంద్ర మోదీ సుమారు ఏడాదిన్నర క్రితమే ఢిల్లీనుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయగా, క్షేత్రస్థాయిలో పర్యాటక శాఖ త్వరలో అభివృద్ధి పనులకు అధికారికంగా శ్రీకారం చుట్టనుంది.

రెండు ప్యాకేజీలుగా టెండర్లు

స్వదేశీ దర్శన్ 2.0కింద రూ.100కోట్లతో భువనగిరి ఖిల్లా అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు నియమించిన ఓ ప్రముఖ ఇంజనీరింగ్ ఏజెన్సీ రూపొందించిన డీపీఆర్ ఆధారంగా మొదటిదశలో రెండు ప్యాకేజీలుగా పిలిచిన అభివృద్ధి పనులకు రెండు ఏజెన్సీలు పనులు దక్కించుకున్నాయి. తెలంగాణలోనే మొట్టమొదటగా ఖిల్లా పైకి నిర్మిస్తున్న రోప్‌వే పనులకు కలకత్తాకు చెందిన ఏజెన్సీ రూ.18కోట్లతో మూడు నెలల క్రితమే దక్కించుకుంది. సివిల్, బ్యూటీఫికేషన్ పనులకు ఇటీవల నిర్వహించిన టెండర్లలో హైదరాబాద్‌కు చెందిన ఏజెన్సీ రూ.30కోట్లతో పనులను దక్కించుకుంది. రెండు ప్యాకేజీల్లోనూ పన్నులు అదనం. రోప్‌వే పనుల అగ్రిమెంట్ మూడు నెలల క్రితమే పూర్తి కాగా సివిల్, బ్యూటీఫికేషన్ టెండర్ పనుల అగ్రిమెంట్ గత వారం పూర్తయింది. నిబంధనల ప్రకారం రెండు ప్యాకేజీల పనులు 2026 మార్చి నాటికి పూర్తి కావాలి. కాని 2027 తొలి నెలల్లో పనులు పూర్తి కావచ్చునని పలువురు భావిస్తున్నారు.

పనులు ఇలా..

రూ.18కోట్ల ప్యాకేజీలో బైపాస్‌రోడ్డు వెంట సేకరించిన ప్రైవేటు సంస్థలో ఏర్పాటు చేయనున్న బేస్ క్యాంప్ నుంచి ఖిల్లా పైభాగం వరకు..

మిగతా 8వ పేజీలో..



నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి జయరాజు



స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జయరాజు

భువనగిరి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కోర్టు భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జయరాజు అన్నారు. జిల్లా కోర్టు భవనాల నిర్మాణానికి కేటాయించిన భువనగిరి పట్టణ శివారు మాసుకుంటలోని 10 ఎకరాల స్థలాన్ని జయరాజు బుధవారం పరిశీలించారు. భవనాల నిర్మాణానికి రూ.81కోట్లతో టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈమేరకు నిర్మాణ పనుల కోసం అధికారికంగా స్థలాన్ని ఆర్అండ్‌బీకి అప్పగించారని, సకాలంలో నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలన్నారు. ఆయనవెంట జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి మాధవి లత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వల్లందాస్ వెంకటయ్యగౌడ్ ఉన్నారు.

గణేష్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- డీసీపీ అక్షాంశ్ యాదవ్



గోధుమకుంట చెరువును పరిశీలిస్తున్న డీసీపీ అక్షాంశ్ యాదవ్

ఆలేరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు డీసీపీ అక్షాంశ్ యాదవ్ తెలిపారు. ఆలేరు మండలంలోని గోధుమకుంట చెరువును ఆయన పరిశీలించి మాట్లాడారు. గణేష్ నిమజ్జనానికి ముందు రోజు చెరువును తమ ఆధీనంలోకి తీసుకోవాలని పోలీసులకు సూచించారు. ఆయన వెంట ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, ఆలేరు ఎస్‌హెచ్‌వో యాలాద్రి, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఉన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: గణేష్ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా విగ్రహాల నిమజ్జనం కోసం భువనగిరి డీసీపీ ఆకాంక్ష్‌యాదవ్ బుధవారం యాదగిరిగుట్ట మునిసిపాలిటీ పరిధిలోని చాకలిగిద్దె, మండలంలోని చిన్నకందుకూర్ మధిర గ్రామమైన గోధుమకుంట చెరువులను వేర్వేరుగా పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు, సీఐ భాస్కర్‌లకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించాలి

భువనగిరి గంజ్: వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, పర్యావరణ హితంగా నిర్వహించాలని భువనగిరి గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు రత్నపురం శ్రీశైలం అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం స్థానిక రిటైర్డ్ ఎంప్లాయీస్ భవనంలో ఉత్సవ సమితి సమావేశంలో వారు మాట్లాడారు. వినాయక నవరాత్రులు ఈ నెల 27 నుంచి ప్రారంభం కాబోతున్నాయని, వివిధ మండపాల అధ్యక్షులు, నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. భక్తిశ్రద్ధలతో నవరాత్రులు పూజా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భువనగిరి సీఐ రమేష్, సుర్వి శ్రీనివాస్, బెల్లంకొండ చందు, పోగుల రవీందర్, కాలేరు లక్ష్మణ్, రాజు, నాగరాజు, నర్సింగ్, సురేష్, ప్రేమ్, రమేష్, మణికంఠ, సాయికిరణ్, సాయికిరణ్ పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడి

తుర్కపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నానో యూరియాతో అధిక దిగుబడి పొందవచ్చని ఏఈవోలు జెస్సీ, తిరుమలరావు అన్నారు. గురువారం మండలంలోని వీరారెడ్డిపల్లి రైతు వేదికలో నానో యూరియాపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఎకరం వరికి పైపాటుగా అర లీటర్ నానో యూరియా సరిపోతుందన్నారు. రైతులు రసాయన ఎరువులను తగ్గించుకొని ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు జక్కుల వెంకటేష్, గుర్రాల కనకరాజు, బిట్ల లక్ష్మీనర్సింహారెడ్డి, బిట్ల సత్తిరెడ్డి, కొంతం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మూడు రోజులపాటు పారిశుధ్య కార్యక్రమాలు

- భారీ వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు
- కలెక్టర్ హనుమంతరావు
- మోటకొండూరు, ఆత్మకూరు(ఎం)లలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



ఆత్మకూరు(ఎం) ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేటినుంచి మూడు రోజుల పాటు పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. బుధవారం ఆత్మకూరు(ఎం) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్, ఆరోగ్య కేంద్రంలో చేసిన కాన్పుల రిజిస్టర్లను పరిశీలించారు. కాన్పులు చేసుకున్న మహిళలతో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడారు. వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ వంశీకృష్ణ, వైద్య సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. అనంతరం మండల కేంద్రంలో నరేష్ అగ్రిమాల్ ఎరువుల దుకాణంలోస్టాక్ రిజిస్టర్లు, నిర్వాహకుని లైసెన్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీరాజ్, వైద్య, ఆరోగ్య, విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు గ్రామగ్రామాన పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం 'పనుల జాతర' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. వర్షాలకు దెబ్బతిని శిథిలావస్థలో ఉన్న ఇళ్లను వెంటనే గుర్తించాలని ఆదేశించారు. ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసిన రైతులను కలెక్టర్ పలకరించి ధరలను అడిగి తెలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడా యూరియా కొరత లేదని, వదంతులు నమ్మవద్దని రైతులకు సూచించారు. అవసరమున్నంత వరకే యూరియాను కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటికే 2.15లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తయినట్లు తెలిపారు. ఆయనవెంట తహసీల్దార్ వి.లావణ్య, డీటీ షఫీయొద్దీన్, ఆర్ఐ వెంకటేశ్వర్లు, ఏఈవో సరిత, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులను త్వరగా పూర్తి చేయాలి

మోటకొండూరు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం మండలంలోని కాటేపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ డబ్బులు లేక ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనులు మధ్యలో ఆగిపోతే మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకుని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సిమెంట్, స్టీల్, ఇసుక, తక్కువ ధరకు ఇప్పించాలని అధికారులకు సూచించారు. ఆయనవెంట ఎంపీడీవో ఇందిర, ఏఈ రవిచంద్ర, పంచాయతీ కార్యదర్శి మల్లేష్ ఉన్నారు.

భువనగిరి (కలెక్టరేట్): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలో మూడు రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టి అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. ప్రత్యేక శానిటేషన్ నిర్వహణపై బుధవారం డివిజనల్, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. శానిటేషన్ నిర్వహణ ప్రజల ఆరోగ్యాలతో ముడిపడి ఉందని, నిర్లక్ష్యం చేయవద్దన్నారు. తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయించాలని, ఎక్కడా కూడా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. అంతకుముందు టాస్ అధికారులతో ఓపెన్ స్కూల్ ప్రవేశాల పెంపులో అనుసరిస్తున్న మార్గదర్శకాలు ప్రగతిని అడిగి తెలుసుకున్నారు.

ఆరుట్ల కుటుంబం నేటి తరానికి ఆదర్శం

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భూమికోసం, భుక్తికోసం, వెట్టి చాకిరి నుంచి విముక్తికోసం పోరాడిన ఆరుట్ల కమలాదేవి రామచంద్రారెడ్డి కుటుంబం నేటి తరానికి ఆదర్శమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ఆరుట్ల కమలాదేవి రామచంద్రారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా టైలరింగ్, ఎంబ్రాయిడరీ, కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు బుధవారం యాదగిరిగుట్టలో సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, ఫౌండేషన్ నిర్వాహకులు సుశీల, ఆరుట్ల శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌పై గస్తీ.. చలో బస్తీ

- సైకిళ్లపై పెట్రోలింగ్‌తో నేరుగా ప్రజల వద్దకు పోలీసులు
- శాంతి భద్రతలు, తదితర అంశాల పర్యవేక్షణ
- వాహనాలు వెళ్లలేని గల్లీల్లోకి సైకిల్‌పై..

•6లో



సైకిళ్లపై గస్తీకి బయలుదేరిన పోలీసులు

కొనసాగుతున్న మూసీ ఉధృతి

- పలు గ్రామాలకు రాకపోకలు నిలిపివేత



ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ

యాదాద్రి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చిరు జల్లులతో కూడిన వర్షాలు కురిశాయి. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన వర్షాలకు జిల్లాలో సగటున 0.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాలతో మూసీనది పరవళ్లు తొక్కుతోంది. మూసీ ఏ క్షణమైనా ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున, ఎవరూ లోలెవల్ బ్రిడ్జిలపై వెళ్లనివ్వకుండా అధికారులు తగిన చర్యలు చేపడుతున్నారు. మూసీ ఉధృతి నేపథ్యంలో బీబీనగర్ మండలంలోని రుద్రవెల్లి-జూలూరు లోలెవల్ బ్రిడ్జి మీదుగా రాకపోకలు నిలిపివేసి పిలాయిపల్లి, మక్తాఅనంతరం మీదుగా భువనగిరి మీదుగా వాహనాలను మళ్లిస్తున్నారు. వలిగొండ మండలం సంగెం-బొల్లేపల్లి లోలెవల్ బ్రిడ్జి మీదుగా రాకపోకలు నిలిపివేసి, వలిగొండ మీదుగా భువనగిరికి వాహనాలను మళ్లిస్తున్నారు. మూసీలో చేపల వేటకు వెళ్లడంతో పాటు వ్యవసాయ పనుల నిమిత్తం గ్రామస్థులు లోలెవల్ బ్రిడ్జిలపై నుంచి వెళుతున్నారు. అయితే ప్రమాదాలకు గురికాకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మూసీ ఉధృతి తగ్గే వరకు రాకపోకలు నిలిచివేయాలని జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాలు జారీచేసింది. మంగళవారం బొమ్మలరామారం మండలం మర్యాలలో ఈతకు వెళ్లి గల్లంతైన నందులాల్ (20) మృతదేహం లభ్యమైంది. వర్షం తగ్గుముఖం పట్టడంతో వరితో పాటు పత్తి పొలాల్లో నిలిచిన నీరు భూమిలోకి ఇంకిపోతోంది. ఎగువన కురుస్తోన్న వర్షాలకు చెరువులు, కుంటల్లోకి నీరు వస్తోంది.

వరుస వర్షాలతో

అప్రమత్తం

- గణేష్ ఉత్సవాల్లో దుర్ఘటనల నివారణకు జాగ్రత్తలు
- ట్రాన్స్‌కో ఎస్ఈ సుధీర్‌కుమార్



సుధీర్‌కుమార్

విద్యుదాఘాత ప్రమాదాల నివారణకు సంపూర్ణ జాగ్రత్తలు తీసుకుంటున్నామని, అదే సమయంలో ప్రజలు కూడా స్వీయ నియంత్రణ జాగ్రత్తలు పాటించాలని జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ సుధీర్‌కుమార్ అంటున్నారు. వరుసగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో ప్రమాదాల నివారణకు నిర్వాహకులు సహకరించాలని కోరారు. 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పలు విషయాలు వెల్లడించారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

వరుసగా కురుస్తున్న వర్షాలతో జిల్లా ట్రాన్స్‌కోకు రూ.10లక్షల ఆస్తి నష్టం జరిగింది. 33 కేవీ స్తంభాలు ఒకటి, 11 కేవీ స్తంభాలు 25, ఎల్‌టీ స్తంభాలు 23, నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. నష్టం జరిగిన వెంటనే నూతన స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ ఈదురుగాలులు లేకపోవడంతో ఆస్తినష్టం తక్కువగా ఉండగా, సేవలలోనూ అంతరాయం తగ్గింది.

క్షేత్రస్థాయిలోనే అధికారులు, సిబ్బంది

సబ్ ఇంజనీర్ పైస్థాయి అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం. ప్రతీరోజు సాయంత్రం 6 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నాం. అధికారులందరూ నిర్దేశిత ప్రాంతాలనుంచే కాన్ఫరెన్స్‌లో పాల్గొనేలా, వారి రోజువారి ప్రగతిని నివేదికను అందించేలా కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నాం.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

విద్యుత్ ఇబ్బందులను పరిష్కరించేందుకు జిల్లాలో నాలుగు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశాం. అన్ని కేంద్రాల్లోనూ సిబ్బంది 24 గంటలు విధుల్లో ఉంటున్నారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారికి సమాచారం

మిగతా 8వ పేజీలో..

ప్రాణం తీసిన ఈత సరదా


నందు లాల్(ఫైల్)

బొమ్మలరామారం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఈత సరదా వ్యక్తి ప్రాణం తీసింది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలంలోని మర్యాల గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఘజీపూర్ జిల్లా, కసిమబాద్ మండలం, మండ్లుపూర్ గ్రామానికి చెందిన నందు లాల్(24) మర్యాల గ్రామ సమీపంలో గల బాలాజీ స్టోన్ క్రషర్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఐదుగురు కార్మికులతో కలిసి ఈతకు వెళ్లాడు. ఈ క్రమంలో కుంటలోనే మునిగిపోయాడు. తోటి కార్మికులు ఎంత వెతికినా నందులాల్ ఆచూకీ లభించలేదు. క్రషర్ యాజమాన్యం ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. గజ ఈతగాళ్లతో వెతికినా ఫలితం లేకపోవడంతో, ఫైర్‌సిబ్బందిని పిలిపించి మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వెతికారు. చీకటి పడడంతో ఆ ప్రయత్నాలు విరమించుకున్నారు. బుధవారం ఉదయం ఫైర్ సిబ్బంది మళ్లీ వెతకడంతో నందులాల్ మృతదేహం లభించింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బుగ్గ శ్రీశైలం తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలలకు నోటీసులు

మఠంపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధన అతిక్రమించిన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని ఎన్‌సీఎల్, మాన్‌ఫోర్ట్ పాఠశాలలకు నోటీసులను జారీ చేసినట్లు ఎంఈవో వెంకటాచారి బుధవారం తెలిపారు. అల్పపీడన ప్రభావం వల్ల ఏర్పడిన భారీ వర్షాల నేపథ్యంలో సూర్యాపేట జిల్లాను వాతవారణశాఖ రెడ్‌జోన్‌గా ప్రకటించింది. దీంతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్‌పవర్ ఈ నెల 14 గురువారం జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. కానీ మఠంపల్లి మండలంలోని మాన్‌ఫోర్ట్ పాఠశాల, మట్టపల్లిలోని సింహపురి వద్ద గల ఎన్‌సీఎల్ పాఠశాల యాజమాన్యం కలెక్టర్ ఆదేశాలకు భేఖాతర్ చేసి పాఠశాలను నడిపించారు. పాఠశాల నిర్వహణపై సోషల్ మీడియాలో అదేరోజు వైరల్ అయింది. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆదేశాలు పాటించని పాఠశాలలకు నోటీసులు ఇవ్వాలని ఎంఈవోను ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలకు నోటీసులు అందించినట్లు ఎంఈవో తెలిపారు. పాఠశాల ఎందుకు తెరిచారో రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో వృద్ధురాలు మృతి


జింకల సత్తమ్మ(ఫైల్)

మర్రిగూడ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలో వృద్ధురాలు మృతిచెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలోని 30పడకల సామాజిక ప్రభుత్వ ఆరోగ్య ఆస్పత్రిలో బుధవారం జరిగింది. మృతురాలి కుమారుడు జింకల బిక్షం తెలిపిన వివరాల ప్రకారం... విరోచనాలతో బాధపడుతున్న వట్టిపల్లి గ్రామానికి చెందిన జింకల సత్తమ్మ(65)ను కుమారుడు బిక్షం మంగళవారం ఉదయం మర్రిగూడ 30పడకల ప్రభుత్వ ఆరోగ్య ఆస్పత్రికి తీసుకొచ్చాడు. డాక్టర్లు వైద్యసేవలు అందించగా కొద్దిగా, కోలుకున్నాక మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ఇంటికి తీసుకెళ్లాడు. మళ్లీ అస్వస్థతకు గురవడంతో తిరిగి బుధవారం ఆసుపత్రికి తీసుకొచ్చాడు. చికిత్స పొందుతుండగా సత్తమ్మకు అకస్మాత్తుగా ఊపిరి రావడం లేదని గమనించిన కుమారుడు బిక్షం పక్కనే ఉన్న నర్సులకు విషయం చెప్పాడు. ఆక్సిజన్ పెట్టండి.. లేదా డాక్టర్‌ను పిలవాలని చెప్పినప్పటికీ నర్సులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని బిక్షం ఆవేదన వ్యక్తం చేశాడు. డాక్టర్‌ను పిలవాలని పలుసార్లు నర్సులను వేడుకున్నప్పటికీ వైద్య సేవలు అందించకుండా డాక్టర్లకు చెప్పకపోవడంతో తాను కిందికి వెళ్లి డాక్టర్లు తీసుకొని వచ్చేసరికి తన తల్లి అప్పటికే మృతిచెందిందని ఆవేదన వ్యక్తం చేశాడు. నర్సులు సకాలంలో స్పందించి ఉంటే తన తల్లి బతికేదని రోదించాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కృష్ణారెడ్డి ఆస్పత్రికి చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతురాలి కుటుంబసభ్యులతో మాట్లాడి మృతదేహాన్ని వట్టిపల్లికి తరలించారు. విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్‌నాయక్‌ను వివరణ కోరగా మంగళవారం వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకువచ్చారని వైద్యం చేసి ఇంటికి పంపించామని తెలిపారు.

క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్.. అరగంట నరకయాతన



క్యాబిన్‌లో ఇరుక్కున్న లారీ డ్రైవర్

మోతె, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు వెంట ఆగిఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో లారీ ముందు భాగం ధ్వంసమైంది. క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ అరగంట పాటు నరకయాతన అనుభవించాడు. ఈ సంఘటన సూర్యాపేట-ఖమ్మం రహదారిలో మోతె మండల పరిధిలోని హుస్సేనాబాద స్టేజీ సమీపంలో బుధవారం జరిగింది. ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఖమ్మంకు ఇండియన్ ఆయిల్ ట్యాంకర్‌తో వెళ్తున్న ట్యాంకర్ టైరు పగిలిపోవడంతో రోడ్డు వెంబడి నిలిపి మరమ్మతులు చేస్తున్నారు. సూర్యాపేట నుంచి ఖమ్మం వస్తున్న లారీ డ్రైవర్ అతివేగంతో లారీ నడపడంతో ఆగి ఉన్న ట్యాంకర్‌ను తప్పించలేక బ్రేకులు పడకపోవడంతో ఆయిల్ ట్యాంకర్ వెనకాల భాగాన్ని ఢీకొంది. లారీ ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. డ్రైవర్ ఇంద్రజిత్తు మండల్ లారీ సీటులో కాళ్లు విరిగి క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు పోలీసులు, నేషనల్ హైవే సిబ్బంది సహాయంతో డ్రైవర్‌ను బయటకు తీసి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ధ్వంసమైన లారీని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డులో దిగబడిన ఎరువుల లోడ్ లారీ


రహదారిలో ఇరుక్కున ఎరువుల లోడు లారీ

చండూరు రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామ శివారులో బుధవారం తెల్లవారు జామున ఎరువుల లోడ్ లారీ నడిరోడ్డుపై దిగబడింది. ఇటీవల కురిసిన వర్షాలకు చండూరు మండలం బంగారిగడ్డ రోడ్లపై గుంతలు ఏర్పడి, నీళ్లు నిలిచాయి. నాంపల్లి మండలానికి వెళ్లాల్సిన ఎరువుల లోడ్ లారీ బుధవారం తెల్లవారుజామున బంగారిగడ్డ గ్రామం మీదుగా వెళ్తున్న క్రమంలో నడిరోడ్డుపై వెనక టైర్లు పూర్తిగా రోడ్డు మధ్యలో ఉన్న గుంతలో దిగబడింది. దీంతో లారీ డ్రైవర్ ఒక్కడే బయటకు తీసేందుకు ప్రయత్నించి, తెల్లవారు జామున తెల్లవారుజాము తర్వాత గ్రామస్థులు ఎక్స్‌కవేటర్ సహాయంతో బయటకు తీశారు. దీంతో అటుగా వెళ్తున్న వాహనదారులు, స్కూల్ బస్సులు చాలా సేపు నిలిచిపోయి ఇబ్బందులకు గురయ్యారు.

పెంపుడు కుక్కపై అభిమానం

● ఐదో రోజున 150మందికి అన్నదానం


పెంకి ఫొటో వద్ద సామేల్

మునగాల రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాలె సామేల్ ఆయన సతీమణి జయమ్మ మూగజీవిపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. తమ ఇంట్లో 14 సంవత్సరాలుగా పెంచుకున్న కుక్క (లక్కీ) ఈ నెల 16న అనారోగ్యంతో మృతిచెందగా, వారు మానసిక వేదనకు గురయ్యారు. లక్కీ ఆత్మకు శాంతి చేకూరాలని బుధవారం 5వ రోజున ఖర్మకాండలు నిర్వహించి, సుమారు 150మందికి అన్నదానం చేశారు. మూగజీవి పట్ల ఇంత ప్రేమ పెంచుకున్న వారిని గ్రామస్థులు అభినందించారు.

జనాల మధ్యన ఆబోతు

పాలకవీడు: ఆంబోతు(దేవుడిని నమ్ముకుని ఊరు మీద వదిలేసిన ఎద్దు) జనాల మధ్యనే ఉంటూ ప్రజలతో మమేకమై తిరుగుతోంది. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని మీగడంపాడు తండాలో ఆంబోతు గ్రామంలోని వీధుల్లోకి వచ్చి జనాలమధ్యనే ప్రశాంతంగా ఉండడం.. ఫంక్షన్లల్లో జనాలు ఉన్న చోట నిలడడటంతో గ్రామస్థులకు కూడా అలవాటుగా మారింది. ఇటీవల మీగడంపాడు తండాలో గిరిజన రైతు రూపావత్ చిన్నా నాయక్(54) మృతిచెందారు. భౌతికకాయాన్ని చూడటానికి గ్రామ ప్రజలు వచ్చారు. ఆ సమయంలో ఆంబోతు అలవాటులో భాగంగా చిన్నానాయక్ పక్కన, జనాల మధ్య ఉన్న దృశ్యాలను కొందరు మొబైల్ ఫోన్లలో బంధించి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అవి వైరల్‌గా మారాయి.

సైకిల్‌పై గస్తీ.. చలో బస్తీ



● సైకిళ్లపై పెట్రోలింగ్‌తో నేరుగా ప్రజల వద్దకు పోలీసులు ● శాంతి భద్రతలు, తదితర అంశాల పర్యవేక్షణ ● వాహనాలు వెళ్లలేని గల్లిల్లోకి వెళ్లే అవకాశం

ప్రజలకు మరింత చేరువయ్యేందుకు, విజుబుల్ పోలీసింగ్ తదితర బహుళ ప్రయోజనాల లక్ష్యంగా తెలంగాణ పోలీస్ శాఖ అమల్లోకి తెచ్చిన సైకిల్ పెట్రోలింగ్ యాదాద్రిభువనగిరి జిల్లాలో సాగుతోంది. పట్టణాల్లో పోలీస్ సైకిల్ పెట్రోలింగ్ మెరుగ్గ కొనసాగుతుండగా, గ్రామీణ ప్రాంతాల్లో నెమ్మదించింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని 18 పోలీస్‌స్టేషన్లకు గతంలోనే రాచకొండ కమిషనరేట్ 38సైకిళ్లు అందజేశారు. 19 బృందాలు ఏర్పాటు చేశారు.

● ఆంధ్రజ్యోతి, భువనగిరి టౌన్


బీబీనగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న సైకిల్ పెట్రోలింగ్ బృందం (ఫైల్)

విజుబుల్ పోలీసింగ్, క్విక్ రెస్పాన్స్ టెక్నాలజీ (వి క్యూ టీ) విధానంతో పోలీసులు ప్రజలకు చేరువయ్యే లక్ష్యంతో తెలంగాణ పోలీస్‌శాఖ సైకిల్ పెట్రోలింగ్‌ను అమలులోకి తెచ్చింది. మొదట రాచకొండ కమిషనరేట్, వరంగల్‌లో అమలు చేస్తున్నారు. అలాగే రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎఫ్‌ఆర్‌సీసీ (ఫస్ట్ రెస్పాండ్ కమాండ్ సెంటర్)ను ఏర్పాటు చేసి శాంతి భద్రతలు, తదితర అంశాలను పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర కాల్స్ అందిన 10నిమిషాలలో పోలీసులు బ్లూ కోట్స్, కార్లు ఇతర వాహనాలతో పాటు సైకిళ్లపై కూడా పోలీసులు వెళ్లాలని మరో లక్ష్యం. సైకిళ్లపై వెళ్లడం ద్వారా ప్రజలను పోలీసులు నేరుగా కలవచ్చు. ఎక్కువ సేపు పెట్రోలింగ్ చేయవచ్చనే ఉద్దేశంతో సమీపం నుంచి వెళ్తున్న పోలీసులను అత్యవసరమనుకుంటే ప్రజలు ఆపి మాట్లాడవచ్చు. సైకిళ్లపై నెమ్మదిగా వెళ్లడం ద్వారా పరిసరాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించవచ్చు. వాహనాలు వెళ్లలేని ఇరుకైన గల్లీల్లోకి కూడా సైకిళ్లపై వెళ్లడం ద్వారా ప్రజలకు భరోసా లభిస్తుంది. అదే సమయంలో ప్రజలతో స్నేహ పూర్వకంగా ఉండే అవకాశాలు పోలీసులకు లభిస్తాయి. సైకిల్ తొక్కడం ద్వారా పోలీసుల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని పోలీసు అధికారులు చెబుతున్నారు.

గ్రామాల్లో కానరాని సైకిల్ పెట్రోలింగ్

బహుళ లక్ష్యాలతో అమల్లోకి తెచ్చిన సైకిల్ పెట్రోలింగ్ అవే బహుళ కారణాలతో ఆశించిన ఫలితాలు లభించడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. పట్టణాల్లో ఈ విధానం కాస్త మెరుగ్గా అమలవుతోంది. పోలీస్‌స్టేషన్ నుంచి సైకిల్‌పై బయలుదేరిన వెంటనే ప్రజలు కలవడం, బస్తీలన్నీ స్వల్ప దూరంలోనే ఉండడం, రహదారులు, వీధి దీపాలు, తదితర సదుపాయాలు ఉండే కారణాలతో పోలీసులు సైకిళ్లపై వెళ్లేందుకు వెనుకంజ వేయడం లేదు. కానీ మండల పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. పోలీస్‌స్టేషన్, గ్రామాల మధ్య దూరం ఉండడంతో పాటు పలు కారణాలతో సైకిల్ పెట్రోలింగ్ ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. కొన్ని మండల పోలీస్‌స్టేషన్ల పరిధిలో కొద్దిమేర అమలవుతున్నప్పటికీ మరికొన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆ ఆనవాళ్లే లేవని, ఆయా మండలాల ప్రజలు అంటున్నారు. అయితే సైకిల్ పెట్రోలింగ్ ద్వారా చేధించిన, నియంత్రించిన ఘటనలు, కేసులేవి ఇప్పటి వరకు నమోదు కాలేదని పోలీస్ సిబ్బంది అంటున్నారు.

ప్రతిరోజూ సైకిల్ పెట్రోలింగ్



భువనగిరి టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతిరోజూ సైకిల్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. రద్దీగా ఉండే ప్రాంతాల్లో కానిస్టేబుల్స్ సైకిళ్లపై వెళ్తున్నారు. అవసరమైతే రాత్రి పూట కూడా గల్లీలలో సైకిళ్లపై తిరుగుతున్నారు. ఇందుకు ప్రత్యేక బీట్ ఏర్పాటు చేశాము. సైకిల్ పెట్రోలింగ్‌తో పోలీసులు ప్రజలకు చేరువతుతున్నారు. అదే సమయంలో పలు సమాచారాలను ప్రజలు ఇస్తున్నారు.
రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ భువనగిరి టౌన్.

విద్యావేత్త చినవెంకట్‌రెడ్డి కన్నుమూత


నివాళులర్పిస్తున్న మాజీమంత్రి జగదీష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుమ్ముల మోహన్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, నల్లగొండ కల్చరల్, నల్లగొండ రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రానికి చెందిన విద్యావేత్త కొండకింది చిన వెంకట్‌రెడ్డి(97) మంగళవారంరాత్రి నల్లగొండలోని తన నివాసంలో మృతిచెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలోని ఓగోడు గ్రామానికి చెందిన కొండకింది నర్సమ్మ, రంగారెడ్డి దంపతులకు 1929 సంవత్సరం సెప్టెంబరు 18వ తేదీన వెంకట్‌రెడ్డి జన్మించారు. అర్వపల్లి మండలం తిమ్మాపురంలో గ్రామానికి చెందిన మేనమామ వద్ద ఆయన విద్యాభ్యాసం కొనసాగింది. 1947లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి హెచ్ఎంగా పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం విద్యావేత్తగా, రాజకీయ నాయకుడిగా, సామాజిక కార్యకర్తగా, శాంతి సంఘం సభ్యుడిగా అనేక బాధ్యతలు పోషించారు. పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి గుర్తింపు పొందారు. ఆయన సేవలకు గుర్తింపుగా మదర్ థెరిస్సా ఇంటర్నేషనల్ అవార్డు, రాష్ట్రస్థాయిలో బెస్ట్ సీనియర్ సిటిజన్ అవార్డు, గ్లోబల్ పీస్ అవార్డుతో పాటు పలు అవార్డులు దక్కాయి. సాహిత్య రంగంపై ఉన్న అభిమానంతో ఆయన సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. అనేక మంది బాలబాలికలను కళాకారులుగా తీర్చిదిద్దారు. వెంకట్‌రెడ్డి నేత్రాలను ఆయన కుటుంబ సభ్యులు లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిట్రబుల్ ట్రస్ట్‌కు దానం చేశారు.

పలువురి సంతాపం


చిన వెంకట్‌రెడ్డి (ఫైల్)

చిన వెంకట్‌రెడ్డి అకాల మృతికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చిన వెంకట్‌రెడ్డితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్‌లు చిన వెంకట్‌రెడ్డి భౌతికకాయానికి పూలగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. క్రైౖ నేషనల్ ఎలక్ట్ ప్రెసిడెంట్ గుమ్మి రాంరెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బండారు ప్రసాద్‌తో పాటు నాంపల్లి మనోహర్, ఏదుళ్ల శ్రీధర్‌రెడ్డి, సముద్రాల శ్రీనివాస్ తదితరులు చిన్న వెంకట్‌రెడ్డి పార్థీవదేహానికి నివాళులర్పించారు. డ్వాట్ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కారావు వెంకట్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు, కవులు, రచయితలు, సాహితీ వేత్తలు, వివిధ రాజకీయ నాయకులు వెంకట్‌రెడ్డి మృతికి సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

సూర్యాపేటక్రైం, ఆగస్టు 20, (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపిన ఒకరికి జైలు శిక్ష, పలువురికి జరిమానా విధించారు. సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ ఆర్. సాయిరాం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 19వ తేదీన సూర్యాపేట జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఆరుగురు మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడపడంతో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. వారిని బుధవారం సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ బీవీ రమణ ఒకరికి ఒక రోజు జైలుశిక్ష, రూ.2వేల జరిమానా, మిగిలిన ఐదుగురికి కలిపి రూ.7,500 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

భువనగిరి టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలోని న్యూభారత్ ఆసుపత్రికి వైద్య చికిత్స కోసం వచ్చిన మండలంలోని కేసారం గ్రామానికి చెందిన అంజయ్యగౌడ్ బైక్ బుధవారం చోరీకి గురైంది. ఆసుపత్రి ఎదుట నిలిపి లోపలికి వెళ్లివచ్చేసరికి బైక్ కనిపించలేదు. దీంతో పరిసరాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలలో అనుమానితుడిగా ఓ వ్యక్తిని గుర్తించి ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాపాటకు బహువచనం ప్రజానాట్యమండలి

● సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

రామన్నపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాటకు బహువచనం ప్రజానాట్యమండలి అని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలకేంద్రంలోని స్థానిక పాత బస్టాండ్ ఆవరణలో బుధవారం జరిగిన వీధినాటక ఉత్సవాల సభలో ఆయన మాట్లాడారు. నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుంచి నేటి ప్రజాపోరాటాలకు వరకు ప్రజానాట్యమండలిది వన్నె తగ్గని పాత్ర అని అన్నారు. జానపద రూపాలు అంతరించిపోతున్న తరుణంలో సబ్బండ కళారూపాల ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజా కళలకు చావులేదని, భూ ప్రపంచం ఉన్నంతవరకు ప్రజా పోరాటాలు ఉన్నంతవరకు పాటకు ప్రాణం ఉంటుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ ప్రజా పోరాటాలకు ఆయుధం ఇచ్చింది కళారూపాలే అన్నారు. నేటి ప్రపంచీకరణ నేపథ్యంలో వస్తున్న వింత పోకడలో ప్రజా కళలు పెట్టుబడిదారులు చేతుల్లోకి వెళుతున్నాయని, సినిమాలు ఇతర రూపాల్లో అవి వికృత రూపం దాల్చుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా కోఆర్డినేటర్ ప్రజా గాయని వేముల పుష్ప, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ, మాజీ నాయకులు ఎండీ జహంగీర్, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటపాక శివకుమార్, ఈర్లపల్లి ముత్యాలు, దేశపాక రవి, కూరెళ్ళ నరసింహచారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు లింకు రోడ్లు నిర్మించాలి


రోడ్లు పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాలను నుంచి సమీప గ్రామాలు, జిల్లాకేంద్రాలకు వెళ్లడానికి రోడ్లు సరిగా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున అన్నారు. నల్లగొండ జిల్లా నల్లగొండ మండల పరిధిలోని జి. చెన్నారం గ్రామంలోని రోడ్లను బుధవారం పరిశీలించారు. రైతులు పండించిన పంటలను మార్కెట్‌కు తీసుకురావడానికి, ప్రజలు కూడా నడవలేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం పత్రికలకే పరిమితమైన ప్రకటనలు చేస్తోందని, వాస్తవానికి ఒక్క రోడ్డు కూడా సరిచేయని దుస్థితి కొనసాగుతుందని విమర్శించారు. చెన్నారం నుంచి అనంతారం వరకు వెళ్లే రహదారి నుంచి వందలాది మంది రైతులు ట్రాక్టర్లు, వరి కోత మిషన్లు తరలించడానికి వినియోగిస్తున్నారని తెలిపారు. వెంటనే నిధులు మంజూరు చేసి రహదారిని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, మండల కార్యదర్శి నలుపురాజు సైదులు, కొండా వెంకన్న పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి


కస్తూర్బా పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

శాలిగౌరారం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని నల్లగొండ జిల్లా లీగల్ మెట్రాలాజీ అధికారి, శాలిగౌరారం మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా శాలిగౌరారంలోని సింగిల్ విండో గోదాంను శ్రీనివాస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాంలో ఉన్న రికార్డులను, ఎరువులను పరిశీలించారు. అనంతరం కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించారు. వంటగదులను, తరగతి గదులను పరిశీంచారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ జహీరుద్దీన్, ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి, సింగిల్ విండో సీఈవో నిమ్మల ఆంజనేయులు, కేజీబీవీ ఎస్‌వో నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణి మృతి కేసులో భర్త సహా ఏడుగురు అరెస్టు

● అబార్షన్ వికటించి అధిక రక్తస్రావంతో మృతి ● తుంగతుర్తిలో ఈ నెల 15న ఘటన



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్

సూర్యాపేటక్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గర్భిణికి గర్భవిచ్ఛిత్తి చేసి ఆమె మృతికి కారణమైన ఘటనలో భర్త సహా ఏడుగురిని సూర్యాపేట జిల్లా తుంగతుర్తి పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ కేసు వివరాలు వెల్లడించారు. మద్దిరాల మండలం గోరెంట్ల గ్రామానికి చెందిన పెయింటర్‌గా పనిచేసే బయగల శ్రీనివాస్-విజిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మూడోసారి గర్భందాల్చిన విజితకు స్కానింగ్ చేయించేందుకు భర్త శ్రీనివాస్ ఖమ్మం పట్టణానికి చెందిన నర్సు తుమ్మచర్ల అరుణను సంప్రదించాడు. ఇందుకోసం ఖమ్మంలో పోలంపల్లి కల్పన నిర్వహించే ప్రైవేట్ క్లినిక్‌లో స్కానింగ్ చేయించేందుకు అరుణ మాట్లాడుకుంది. అక్కడ స్కానింగ్ యంత్రం లేకపోవడంతో ఖమ్మంకు చెందిన పులి వీరభద్రరావు ద్వారా యంత్రాన్ని తీసుకువచ్చి, స్కానింగ్ చేసేందుకు ల్యాబ్ టెక్నీషియన్ అశోక్‌ను సంప్రదించింది. ఈ నెల 2వ తేదీన ఖమ్మంలో విజితకు స్కానింగ్ చేయగా, ఆడపిల్ల అని తేలటంతో అబార్షన్ చేయించాలని భర్త భావించాడు. దీంతో సూర్యాపేట జిల్లా నాగారం మండలం పసునూరు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు పానుగంటి సతీష్ ద్వారా తుంగతుర్తిలోని సాయి బాలాజీ క్లినిక్ నిర్వహకుడైన ఆర్ఎంపీ వైద్యుడు బండి శ్రీనివాస్‌ను సంప్రదించారు. ఈ నెల 15న విజితకు తుంగతుర్తిలోని సాయిబాలాజీ క్లినిక్‌లో అబార్షన్ చే యగా, వైద్యం వికటించి అధిక రక్తస్రావంతో మృతిచెందింది. ఈ ఘటనపై తుంగతుర్తి సీఐ నర్సింహారావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు విజిత మృతికి కారకులైన ఆమె భర్త శ్రీనివాస్, అబార్షన్ చేసిన ఆర్ఎంపీ బండి శ్రీనివాస్, సహకరించిన మరో ఆర్ఎంపీ పానుగంటి సతీష్, స్కానింగ్ చేసిన సంపెట అశోక్, స్కానింగ్ చేయడానికి సహకరించిన తుమ్మచర్ల అరుణ, పులి వీరభద్రరావు, పోలంపల్లి కల్పనను అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలిలించారు. వారి నుంచి స్కానింగ్ మిషన్, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో తుంగతుర్తి సీఐ నర్సింహారావు, ఎస్ఐ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

చెరువుకు మహర్దశ!

- నార్కట్‌పల్లి పెద్దచెరువు పేరు మార్పు
- 'వేణుగోపాలస్వామి చెరువు'గా నామకరణం?
- చెరువు మధ్యలో వేణుగోపాలస్వామి గుడి
- బోటులో వెళ్లి దర్శించుకునేలా నిర్మాణం
- అధికారులకు మంత్రి కోమటిరెడ్డి సూచన
- ప్రతిపాదనల తయారీల్లో ఐబీ అధికారులు

నార్కట్‌పల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పెద్ద చెరువుకు మహర్దశ పట్టనుంది. భవిష్యత్తులో ఓ ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వ పెద్దలు ఆలోచిస్తున్నారు. ఇందులో భాగంగానే ఇప్పటికే సుమారు రూ.30 కోట్లతో చెరువు సుందరీకరణ, ఆధునికీకరణకు ప్రతిపాదనలు తయారు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, నల్లగొండ డివిజన్ నీటి పారుదల శాఖ అధికారులకు ఇటీవలే ఆదేశాలు ఇచ్చిన విషయం విదితమే. అయితే నార్కట్‌పల్లి పెద్ద చెరువును కేవలం సుందరీకరణ, ఆధునీకరణ చేయడంతోనే సరిపెట్టుకోకుండా పర్యాటక ప్రదేశంగా మార్చాలనే సంకల్పంతో తాజాగా కొత్త ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. నార్కట్‌పల్లి పెద్ద చెరువును ఇకపై 'వేణుగోపాలస్వామి చెరువు'గా పేరు మార్చాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు ఇటీవల నల్లగొండలో తన నూతన క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవ సందర్భంగా రెవెన్యూ, ఐబీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో సంబంధిత అధికారులకు ఆయన సూచనప్రాయంగా చెప్పినట్లు సమాచారం.



నార్కట్‌పల్లి పెద్ద చెరువు

ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం

నార్కట్‌పల్లి పెద్ద చెరువు పేరును మార్చాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తమ శాఖ ఉన్నతాధికారులు సూచించారు. వారి ఆదేశాల మేరకు నార్కట్‌పల్లి పెద్ద చెరువు పేరును మార్చే ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. 'వేణుగోపాలస్వామి చెరువు'గా పేరు మార్చేలా కావాల్సిన ఉత్తర ప్రత్యుత్తరాల తయారీ ప్రతిపాదనలు తయారీ దశలో ఉన్నాయి.

- నవీన్, ఐబీ ఏఈ

చెరువు మధ్యలో ఆలయం

బీ.వెల్లెంల ఉదయ సముద్రం రిజర్వాయర్ నుంచి తాత్కాలిక కాల్వల ద్వారా నార్కట్‌పల్లి పెద్ద చెరువుకు ప్రస్తుతం నీటి రాక కొనసాగుతోంది. కాల్వల నిర్మాణం పూర్తయిన తర్వాత శాశ్వతంగా రిజర్వాయర్ నుంచి నీటి విడుదల కొనసాగి చెరువు ఎప్పుడూ నిండుగా ఉండనుంది. ఈ నేపథ్యంలో చెరువు మధ్యలో వేణుగోపాలస్వామి ఆలయాన్ని నిర్మించి సందర్శకులు, భక్తులు బోటులో వెళ్లి దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు రూ.4 కోట్ల అంచనాతో ఆకట్టుకునే గుడి నిర్మాణం చేపట్టాలని సూచించినట్లు సమాచారం. చెరువు చుట్టు కొలత మొత్తం 4.15 కి.మీలు ఉంది. మధ్యలో గుడి కడితే ఓ ప్రత్యేక ఆకర్షణగా ఉండనుందని, తద్వారా ఈ చెరువు పర్యాటకంగా అభివృద్ధి చెందనుంది. తద్వారా వ్యాపారపరంగా ఉపాధి వనరులు పెరుగుతాయని అమాత్యులు భావిస్తున్నట్లు సమాచారం.

'పేరు మార్పిడి'కి ప్రతిపాదనలు

మంత్రి కోమటిరెడ్డి సూచనల మేరకు నార్కట్‌పల్లి పెద్ద చెరువు పేరు మార్పు ప్రక్రియను ఐబీ అధికారులు ప్రారంభించినట్లు తెలిసింది. పేరు మార్పిడి జరగాలంటే తొలుత ఐబీ డివిజన్ డీఈఈ ద్వారా ఈఈకి అక్కడి నుంచి జిల్లా కలెక్టర్‌కు అప్పీలు చేసుకోవాలి. కలెక్టర్ ఆమోదం అనంతరం నల్లగొండ రెవెన్యూ డివిజనల్ అధికారి ఆదేశాలతో నార్కట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలోని పహాణీ రికార్డుల్లో పేరు మార్పిడికి కావాల్సిన చర్యలు తీసుకోనున్నారు. యజమాని, అనుభవదారు కాలంలో నార్కట్‌పల్లి పెద్దచెరువు అనే పేరు స్థానంలో 'వేణుగోపాలస్వామి చెరువు'గా మార్చనున్నట్లు సమాచారం.

ఇంటి నిర్మాణానికి ఖర్చు నేనే భరిస్తా

- లబ్ధిదారులకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే వీరేశం
- ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపిన తల్లీకుమారుడు



ఎమ్మెల్యేతో ఫోన్‌లో మాట్లాడుతున్న సోమయ్య

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కట్టంగూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణానికి ఖర్చు తనే భరిస్తానని, తన సొంత ఖర్చులతో మీరు కోరుకున్న విధంగా నిర్మిస్తామని ఎమ్మెల్యే వీరేశం హామీ ఇచ్చారు. 'సర్కార్ దయతలిస్తే నిలువనీడ' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం స్పందించారు. పత్రికలో కథనాన్ని చూసి కలిమెర గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పిన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డికి ఫోన్ చేసి లబ్ధిదారుల వద్దకు వెళ్లి వారి సమస్యలు ఏమిటో వెంటనే తెలియజేయాలని ఆదేశించారు. సదరు నాయకుడు గ్రామానికి చెందిన మరికొంత మంది కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఎమ్మెల్యేతో ఫోన్‌లో మాట్లాడించారు. ఎమ్మెల్యే వీరేశం బాధితుడు వేములకొండ సోమయ్యతో ఫోన్‌లో మాట్లాడి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. ప్రభుత్వం మీకు ఇళ్లు మంజూరు చేసిందని దాని నిర్మాణం కోసం ఆర్థికస్థోమత లేకున్నా నేను సహకరిస్తానని అన్నారు. సోమయ్య మాట్లాడుతూ మేము బతకడమే ఇబ్బందికరంగా ఉందని ప్రభుత్వం ఇచ్చిన ఇంటిని నిర్మించుకునే స్థాయి మాకు లేదని చెప్పారు. మరి ఏమి చేస్తే బాగుంటుందని వారిని ఎమ్మెల్యే ప్రశ్నించారు. మాకు ఇందిరమ్మ ఇళ్లు ఏమీ వద్దని మేము ఇంటిని గోడల వరకు నిర్మించామని, దానిని రేకులు వేసుకుంటామని, మరుగుదొడ్డి నిర్మిస్తేచాలని ఎమ్మెల్యేకు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ తన సొంత ఖర్చులతో మీరు కోరుకున్న విధంగా ఇంటి నిర్మాణం చేసి ఇస్తానని హామీ ఇచ్చారు. ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు దగ్గర ఉండి చూసుకోవాలని స్థానిక కాంగ్రెస్ నాయకులకు సూచించారు. తమ దీన గాథను ప్రచురించి సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి తల్లీకుమారులు కృతజ్ఞతలు తెలిపారు.

బీవెల్లెంల జడ్పీ హైస్కూల్‌లో అసెంబ్లీ ఎన్నికలు

- ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు





విజేతలకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం, ఓటు వేస్తున్న విద్యార్థినులు

నార్కట్‌పల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 'స్కూల్ అసెంబ్లీ' ఎన్నికలు జరిగాయి. విద్యార్థులంతా ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. స్థానిక సంస్థలు, చట్టసభలకు ఏ విధంగానైతే ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించి ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటుందో అదే పద్ధతిలో బ్యాలెట్ ద్వారా ఓటింగ్ నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ, తిరస్కరణ, గుర్తుల కేటాయింపు, ఓటింగ్ ప్రక్రియను పూర్తిగా ఎలక్షన్ కమిషన్ మాదిరిగానే నిర్వహించారు. మొత్తం 145మంది విద్యార్థులు (బాలబాలికలు) ఓటింగ్‌లో పాల్గొన్నారు. బాలుర నుంచి స్కూల్ ఎస్ఆర్ (స్కూల్ రిప్రజెంటేటివ్)గా పదవ తరగతి విద్యార్థి సోమగోని ప్రదీప్, బాలికల నుంచి చిరుమర్తి ప్రణీత ఎన్నికయ్యారు. అదేవిధంగా ప్రతీ క్లాస్‌కు ఒకరి చొప్పున 6 సీఆర్‌లను కూడా ఎన్నుకున్నారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల సంఘం యొక్క పనితీరు స్థానిక సంస్థలు, చట్టసభలకు ప్రజాప్రతినిధులను ఎన్నుకునే విధానంపై విద్యార్థుల్లో అవగాహన కోసమే ఈ విధానాన్ని అమలు చేసినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియను సహ ఉపాధ్యాయుల సాయంతో నరేష్ అనే ఉపాధ్యాయుడు సమన్వయం చేశారు.

నీట్ పీజీ పరీక్షల్లో చందన ప్రతిభ



రచ్చ చందన

భువనగిరి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ నీట్ పీజీ- 2025లో భువనగిరికి చెందిన డాక్టర్ రచ్చ చందన జాతీయస్థాయిలో ప్రతిభ చూపారు. మంగళవారం విడుదలైన నీట్ పీజీ అర్హత పరీక్ష ఫలితాలలో ఆమె జాతీయస్థాయిలో 5,707వ ర్యాంకు సాధించింది. నార్కట్‌పల్లిలోని కామినేని వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన ఆమె రెండో ప్రయత్నంలో మెరుగైన ర్యాంక్ సాధించింది. గైనకాలజిస్ట్‌గా మహిళలకు సేవలు అందించడం తన లక్ష్యమని ఆమె పేర్కొంటున్నారు. కాగా ఆమె సోదరి డాక్టర్ నిఖిల డర్మటాలజీ (చర్మవ్యాధులు) పీజీ తృతీయ సంవత్సరం చదువుతున్నది.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు

- మూత్ర విసర్జన చేస్తూ విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి
- దిద్దుబాటు చర్యలు చేపట్టిన విద్యుత్ శాఖ అధికారులు



ఇనుప కంచె ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సూర్యాపేట క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మూత్రవిసర్జన చేస్తూ ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటనపై అధికారులు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు ఇనుప విద్యుత్ అధికారులు కంచెను ఏర్పాటుచేశారు. సూర్యాపేట పట్టణంలోని నల్లాలబావి సెంటర్‌లో నివాసం ఉంటున్న దంతాల చక్రధర్‌రావు(56) ఈ నెల 19న వాణిజ్యభవన్ పక్కన ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మూత్ర విసర్జన చేస్తున్నాడు. ఆ సమయంలో చిరుజల్లులు కురుస్తుండటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. బుధవారం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఇనుప కంచెను ఏర్పాటుచేశారు. పట్టణంలో అనేక చోట్ల ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని వాటికి కూడా ఇనుప కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సాగర్‌కు భారీగా వరద

- ఎగువ నుంచి 4,85,872 క్యూసెక్కులు రాక
- 26 గేట్ల నుంచి కొనసాగుతున్న నీటి విడుదల



నాగార్జునసాగర్ 26 గేట్ల నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

నాగార్జునసాగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి 4,85,472 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు)కాగా బుధవారం సాయంత్రానికి 583.70 అడుగులుగా (293.6854టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడి కాలువ ద్వారా 8,023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6,022 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,805 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కులు, 26 గేట్ల నుంచి 4,28,834 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 4,78,384 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువనుంచి 4,85,872 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

ప్రాజెక్టు అధికారులు హెచ్చరికలు జారీ


నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక 4 లక్షల పైచిలుకు వస్తుండడంతో దిగువ కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో ఉన్న ప్రజలు, మత్స్యకారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు అధికారులు హెచ్చరిక జారీ చేశారు, మత్స్యకారులు ఎవరూ నదిలోకి వేటకు వెళ్లవద్దని అలాగే పశువుల కాపరులు నదిలోకి తమ పశువులను దింపవద్దని, పశువుల కాపరులు నదిలో దిగవద్దని సూచించారు.

మూసీకి కొనసాగుతున్న వరద ఉధృతి

8 క్రస్టుగేట్లు ఎత్తి వరద నీటి విడుదల

కేతేపల్లి : హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మూసీ రిజర్వాయర్‌కు వరద నీటిరాకడ కొనసాగుతుంది. ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు 13రోజులుగా మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. మూసీకి బుధవారం 8059.56 క్యూసెక్కులుగా ఇన్‌ఫ్లో నమోదైంది. మరోవైపు ప్రాజెక్టు నీటిమట్టం 642.37 అడుగులకు పడిపోయింది. అయినా ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగే వీలున్న నేపథ్యంలో డ్యాం ఇంజనీరింగ్ అధికారులు ప్రాజెక్టు 2, 3, 4, 5, 6, 7, నెంబరు క్రస్టుగేట్లను 2 అడుగులు, 10 నెంబరు క్రస్టుగేటును 1 అడుగు మొత్తం 8 క్రస్టుగేట్ల ద్వారా 9385.42 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు 117.09 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుంది. 645 అడుగులు (4.46 టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 642.37అడుగులు (3.78టీఎంసీలు)గా ఉంది.

అలుగుపోస్తున్న డిండి రిజర్వాయర్



అలుగు పోస్తున్న డిండి రిజర్వాయర్

డిండి : ఎగువన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు దుందుభివాగు వరద ప్రవాహంతో డిండి రిజర్వాయర్ నిండింది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 36అడుగులు(24.టీఎంసీలు) కాగా ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా రిజర్వాయర్ ఈనెల 14 నుంచి ఓవర్ ఫ్లో అవుతుంది. ఎగువ నుంచి 9,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు ప్రాజెక్టు జేఈ పరమేష్ బుధవారం తెలిపారు. స్పీల్‌వే, వియర్ నుంచి 9,900 క్యూసెక్కులు దిగువకు విడుదల అవుతుందని తెలిపారు. హెడ్ రెగ్యులేటర్లద్వారా 160 క్యూసెక్కులు ఆయకట్టుకు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత నెల 30న ప్రాజెక్టు నీటిని ఈ వానాకాలం వరిసాగుకు ఆయకట్టుకు విడుదల చేశారు. దీంతో ప్రాజెక్టు ఎడమకాలువ పరిధిలోని 12,500 ఎకరాలు, కుడికాలువ పరిధిలోని 300 ఎకరాలకు ఈ వానకాలం సాగునీరు అందుతుంది. గతేడాది వానాకాలం, యాసంగి రెండు సీజన్‌లు ప్రాజెక్టు ఆయకట్టు పూర్తిస్థాయిలో సాగులోకి రాగా ఈ వానాకాలం కూడ రిజర్వాయర్ నిండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు మృతి



వెంకమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

చివ్వెంల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల కేంద్రానికి చెందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు బచ్చలి వెంకమ్మ (97) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతదేహానికి సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి ఆ పార్టీ నాయకులతో కలిసి పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో భూమి, భుక్తి విముక్తి కోసం జరిగిన వీర తెలంగాణ సాయుధ పోరాటంలో వెంకమ్మ చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. అప్పట్లో కమ్యూనిస్టు నాయకులు ఎవరైనా వస్తే వారికి భోజనాలు పెట్టి పంపేవారని అన్నారు. సూర్యాపేట, చుట్టుపక్కల ప్రాంతాల్లో జరిగిన అనేక పోరాటాలలో ఆమె పాల్గొన్నారని చెప్పారు. కమ్యూనిస్టులకు అండగా నిలబడి పేద ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపెల్లి సైదులు, ఇట్టమల్ల స్టాలిన్, బొప్పాని సులేమాన్, బచ్చలి కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

మూసీ గురుకుల భవనం పూర్తి చేయాలి

కేతేపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మూసీ గురుకుల పాఠశాల నూతన భవన నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు నిర్వాహకులను కోరారు. బుధవారం మూసీ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో పేరెంట్, టీచర్ మీటింగ్ (పీటీఎం) నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇరుకు గదులతో కూడిన పాఠశాలలో తమ పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఐదారేళ్ల క్రితం నిర్మాణ పనులు ప్రారంభమైనా నేటికీ పాఠశాల పక్కా భవన నిర్మాణ పనులను పూర్తి చేయడంలో తాత్సారం ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ వంటిపాక సుధాకర్ మాట్లాడుతూ నూతన భవన నిర్మాణ పనుల్లో నెలకొన్న జాప్యాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించి, కలెక్టర్ వద్దకు రావాలని కోరారు. పాఠశాల విద్యార్థుల తాగునీటి అవసరాలకు ఎమ్మెల్యే వేముల వీరేశం ఆర్వో ప్లాంటు మంజూరు చేశారని తెలిపారు.



హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి

నల్లగొండ టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ నెల 25వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న సత్యాగ్రహ దీక్ష కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనార్దన్ గౌడ్ మాట్లాడుతూ బీసీ బిల్లుల అమలు విషయమై ప్రజా పోరాటంతో పాటు న్యాయపోరాటం కూడా చేయాల్సి ఉందన్నారు. అసెంబ్లీ ఆమోదించిన రెండు బీసీ బిల్లులు గవర్నర్ వద్ద పెండింగులో ఉండి మూడు నెలలు గడిచిపోయిందని అయితే ఆ బిల్లులను వారు తిరస్కరించడం గాని ఆమోదించడం గాని చేయలేదన్నారు. ఈనెల 25 ఎంపీ ఆర్. కృష్ణయ్య సత్యాగ్రహ దీక్ష చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి, కొంపల్లి రామన్న గౌడ్, మల్లికార్జున్, మహేష్, జితేందర్, శైలేందర్ ,సతీష్ , భాస్కర్ , మహేష్ యాదవ్, యాదగిరి యాదవ్, రాజు యాదవ్, భాస్కరాచారి, లక్ష్మణాచారి పాల్గొన్నారు .



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

నల్లమల అడవుల సంరక్షణకు చర్యలు



మొక్క నాటుతున్న అటవీశాఖ అదనపు వైస్ చైర్‌పర్సన్ సునీతాభగవత్

దేవరకొండ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నల్లమల అడవుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అటవీశాఖ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ అడిషనల్ వైస్ చైర్‌పర్సన్ సునీతాభగవత్ అన్నారు. నల్లగొండ జిల్లా చందంపేట మండలం కంబాలపల్లి, దేవరకొండ అటవీ శాఖ రేంజ్ పరిధిలోని నల్లమలను సందర్శించి మొక్కలు నాటి మాట్లాడారు. కంబాలపల్లి అటవీ రేంజ్ పరిధిలో 26,795 హెక్టార్లలో నల్లమల అటవీ ప్రాంతం విస్తరించి ఉందని, అటవీ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు చెక్‌డ్యామ్, నీటి తొట్లు ఏర్పాటు చేసి తాగు, సాగు నీరు అందిస్తున్నట్లు తెలిపారు. నల్లమలలో వన్యప్రాణులు, చిరుతలు, అటవీ జంతువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అటవీ సంరక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఆమె వెంట అటవీశాఖ అధికారులు సునీల్, హీరామంత్, నల్లగొండ జిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్, రంజిత్‌నాయక్, నాగార్జునసాగర్ అటవీ శాఖ అధికారి సంగీత, దేవరకొండ రేంజ్ అటవీశాఖ అధికారి హస్నీ, రాంమోహన్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బుద్ధవనం ఓ అద్భుతం

- కొనియాడిన వియత్నానికి చెందిన బౌద్ధాచార్యులు థామ్



బౌద్ధచార్యులు థామ్‌తో శివనాగిరెడ్డి

నాగార్జునసాగర్, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్‌లో 274 ఎకరాల్లో నిర్మించిన బుద్ధవనం ఒక అద్భుతం అని అమెరికాలోని హోస్టన్ నగరం వియత్నానికి చెందిన బౌద్ధాచార్యులు థామ్ కొనియడారని ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. శివనాగిరెడ్డి బుధవారం టెక్సాస్ రాష్ట్రంలో బుద్ధ విహారాన్ని, మూడంతస్తుల పగోడాను, 72 అడుగుల ఖ్యాన్ ఆమ్ బోధితత్వాన్ని విగ్రహాన్ని సందర్శించారు. ప్రధాన బౌద్ధాచార్యులతో కలిసి కృష్ణా తీరం వెంట ఉన్న బౌద్ధ వారసత్వ కట్టడాలను, అమరావతి, నాగార్జునకొండ, హిల్‌కాలనీలో ఉన్న బుద్ధవనం గురించి వారికి వివరించారు. జలాశయం మధ్య లో ఉన్న నాగార్జునకొండను సందర్శించాలనుకుంటున్నట్లు థామ్ తెలిపారన్నారు. ఆచార్య నాగార్జునుడి రచనలను ఈ తరానికి తెలియజెప్పే కార్యక్రమాలను బుద్ధవనంలో ఏర్పాటు చేయాలని బౌద్ధాచార్యులు సూచించినట్లు చెప్పారు.

కెనడాకు ఏఈవో, విశ్రాంత ప్రధాన పూజారి

యాదగిరిగుట్ట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కెనడాలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం నిర్వహించేందుకు దేవస్థానం నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం ఏఈవో గజ్వేల్లి రఘు, విశ్రాంత ప్రధాన పూజారి నల్లందీగల్ లక్ష్మీనరసింహచార్యులు కెనడాకు వెళ్లారు. ముందస్తుగా వీరి పేరునా వీసా అనుమతి లభించినందున వీరు బయలుదేరి వెళ్లారు. కాగా, మరో ముగ్గురికి పూజారులకు వీసా అనుమతి రాలేదు. వీసా అనుమతి రాగానే మరో ముగ్గురు పూజారులు వెళ్లనున్నట్లు డీఈవో దోర్బల భాస్కరశర్మ తెలిపారు.

పోలీసులకు దొరక్కుండా.. వాహనం వేగం పెంచి

- కానిస్టేబుల్‌ను ద్విచక్రవాహనంతో ఢీకొట్టిన యువకుడు
- పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఘటన



కానిస్టేబుల్‌ను దాటి వేగంగా వెళ్తున్న యువకుడు

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఓ యువకుడు స్కూటీతో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ వద్ద మంగళవారం సాయంత్రం 6.30కు ట్రాఫిక్ సీఐ విజయ్‌మోహన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని కొత్తపేట ఎస్ఆర్ కాలనీకి చెందిన జాజుల విశాల్ (23) చిట్యాల నుంచి హైదరాబాద్‌కు స్కూటీపై బయలుదేరాడు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులను చూసి వాహనాన్ని అతివేగంతో నడుపుతూ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆసిఫ్‌ను ఢీకొట్టాడు. కానిస్టేబుల్‌ను ఢీకొట్టిన అనంతరం ఆ యువకుడు కిందపడిపోయాడు. తీవ్ర గాయాలకు గురైన కానిస్టేబుల్ ఆసిఫ్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో ఆసిఫ్‌ను యశోద ఆస్పత్రికి తరలించారు. కానిస్టేబుల్ ఆసిఫ్‌కు మూడు చోట్ల కాలు విరిగింది. తలకు గాయాలయ్యాయి. యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేయగా మద్యం తీసుకోలేదని తేలింది. దీంతో పోలీసులు ఆ యువకుడి నుంచి రక్తన మూనాలను సేకరించారు. ప్రమాద దృశ్యాలు సీసీ ఫుటేజ్‌లో నమోదయ్యాయి. కానిస్టేబుల్ అంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

25, 26తేదీల్లో క్రీడా పోటీలు

మోత్కూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడాసమాఖ్య మండల స్థాయి క్రీడాపోటీలు ఈనెల 25, 26 తేదీలల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో తీపిరెడ్డి గోపిరెడ్డి తెలిపారు. బుదవారం మోత్కూరు ఎంఆర్‌సీ కార్యాలయంలో మండల వ్యాయామ, విద్య ఉపాధ్యాయుల కో ఆర్డినేషన్ సమావేశంలో తేదీలు నిర్ణయించినట్లు తెలిపారు. అండర్ 14, 17 విభాగాల్లో బాల, బాలికలకు ఖోఖో, కబడ్డీ అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మోత్కూరును నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి

మోటకొండూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండలాన్ని నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గ ఏర్పాటుకు అధికారులు చొరవ చూపాలని కోరుతూ. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ పోరాట సాధన సమితి నాయకులు కలిమెల నర్సయ్య, గొలుసుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

ఆలేరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ ఉప కమిషన్ పథకంలో భాగంగా ప్రభుత్వం ఆలేరు మండలానికి మంజూరుచేసిన సబ్సిడీ పరికరాల కోసం చిన్న సన్నకారు రైతులు షెడ్యూల్డు కులాలు, తెగల మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ మండల అధికారి శ్రీనివాస్ కోరారు. మహిళా రైతులకు 50శాతం, మిగతా రైతులకు 40శాతం రాయితీపై యాంత్రీకరణ పరికరాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మండలానికి మంజూరైన పరికరాలు ఇలా ఉన్నాయని తెలిపారు. పరవ్‌మ్యాప్, స్టాక్ స్ప్రేయర్లు 12, బ్యాటరీ, మ్యానువల్లీ ఆపరేటెడ్ స్ప్రేయర్లు 75, రోటోవేటర్లు 3, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్ 1, డిస్క్ హేర్ కల్టివేటర్ యంబిక్లౌకేజు 4, పవర్ వీడర్ 1, బ్రష్‌కట్టర్ 1, స్ట్రాబెల్లర్ 1, పవర్‌టిల్లర్ 1 ఉన్నట్లు వివరించారు. ఆసక్తిగల రైతులు దరఖాస్తు ఫారంతో పట్టాదారు పాసుబుక్ ఆధార్‌కార్డు, ట్రాక్టర్ ఆర్‌సి జిరాక్స్‌తో పాటు రెండు పాస్‌ఫోట్ సైజ్ ఫోటోలు జత చేసి ఈనెల 25 వరకు మండల ఏవో కార్యాలయంలో అందజేయాలని కోరారు.

వరుస వర్షాలతో అప్రమత్తం

(5వ పేజీ తరువాయి)

ఇచ్చి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. అలాగే సమస్య పరిష్కారంకోసం టోల్ ఫ్రీ నెంబర్‌కు కూడా ఫోన్ చేయవచ్చు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లోనూ సబ్ ఇంజనీర్ స్థాయి అధికారి నిరంతరం అందుబాటులో ఉంటున్నారు. టోల్‌ఫ్రీ నెంబర్ 1912. ఎస్ఈ కార్యాలయ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712471768. భువనగిరి కంట్రోల్‌రూమ్ 8712488030, చౌటుప్పల్ కంట్రోల్‌రూమ్ 8712472103.

వర్షాలు కురుస్తుంటే ఇల్లే భద్రం

వర్షాలు కురుస్తున్నప్పుడు ఇల్లే సురక్షితం ఎట్టి పరిస్థితుల్లోనూ చెట్ల కింద ఉండొద్దు. పిడుగులను చెట్లు ఆకర్షిస్తాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌కు దూరంగా ఉండాలి. వాటిని ఎట్టి పరిస్థితుల్లో ముట్టుకోవద్దు. తడి దుస్తులతో స్విచ్‌లను ఆన్ ఆఫ్ చేయవద్దు.

సమాచారం ఇవ్వాలి

గణేష్ మండపాల ఎత్తు, ఊరేగింపు మార్గాలపై ఉత్సవాల నిర్వాహకులు ట్రాన్స్‌కో ముందస్తు సమాచారం ఇవ్వాలి. ఎల్‌టీ స్తంభాలు 8 మీటర్లు, తీగలు 7 మీటర్లు 11 కెవి స్తంభాలు 9 మీటర్లు, తీగలు 8 మీటర్లు, 33 కెవి స్తంభాలు 11 మీటర్, తీగలు 10 మీటర్లు ఎత్తులో ఉంటాయి. ఈ సమాంతర లేదా అంతకు పైబడి ఎత్తులో గణేష్ మండపాలు, ఊరేగింపు శకటాలు ఏర్పాటు చేస్తే ఉత్సవాల నిర్వాహకులు ట్రాన్స్‌కోకు తప్పనిసరిగా ముందస్తు సమాచారం ఇవ్వాలి.

గణేష్ మండపాల నిర్వాహకులు నిర్దేశిత రుసుము చెల్లించాలి

మరోవారం రోజులలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అయితే ప్రతి గణేష్ మండపం నిర్వాహకులు తప్పనిసరిగా నిర్దేశిత రుసుములను చెల్లించాలి. రుసుములు చెల్లించిన మండపాలలో విద్యుత్ నిర్వహణకు ట్రాన్స్‌కో సిబ్బందిని కేటాయిస్తాం. విద్యుత్ కనెక్షన్ అధికారికంగా ఇస్తాం. ప్రమాదాలు జరిగితే చట్టపరిధిలో భరోసా లభిస్తుంది. నవరాత్రులపాటు 250 కిలో వాట్స్ కనెక్షన్‌కు రూ. 500కు 500 కిలో వాట్స్ వరకు రూ. 1000, 1000కిలో వాట్స్ వరకు రూ. 1500ఆ పైబడి కిలోవాట్స్‌కు రూ.1500 తోపాటు ప్రతీ 500 కిలో వాట్స్‌కు రూ.750 చార్జీలుగా చెల్లించాలి.

కేబుల్ వైర్స్‌తో తొలగిస్తాం

విద్యుత్ తీగలకు, స్తంభాలకు అడ్డంకిగా ఉన్న ఇంటర్నెట్, టీవీ కేబుల్స్ తొలగిస్తాము. తొలగింపులో రాజీ పడవద్దని కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించాము.

లూజ్ కేబుల్స్ సరి చేస్తున్నాం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నట్లు గుర్తించాం. ఈ మేరకు మండల కేంద్రాల్లో విద్యుత్ తీగల సవరింపు పనులను పూర్తి చేశాం. తదుపరి దఫాలో వ్యవసాయ క్షేత్రాల వద్ద, అనంతరం మిగతా ప్రాంతాల్లో విద్యుత్ తీగలను సవరిస్తాము. సిబ్బంది ప్రమాదాల బారిన పడకుండా అవగాహన కల్పిస్తున్నాము. భద్రత ఉపకరణాలను అందిస్తున్నాము. విద్యుత్ బిల్లుల చెల్లింపులో వినియోగదారులు చిత్తశుద్ధి చూపుతున్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



ఉత్సవమూర్తులకు హారతి నివేదిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుదర్శన హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండిజోడు సేవలు, సహస్రనార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు.

మరిన్ని సేవలు అందించాలి : ప్రభుత్వ విప్ ఐలయ్య

దివ్యాంగులు, వయో వృద్ధులకు సేవలు అందించేందుకు ముందుకు రావాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. యాదగిరిగుట్ట వైకుంఠద్వారం చెంత బుధవారం లైఫ్ మెడికల్ సిస్టమ్స్ అధినేత ఉషాకిరణ్ ఆధ్వర్యంలో 10 వీల్‌చైర్ సైకిళ్లను నిర్వాహకుల ద్వారా అందజేసి వారు మాట్లాడారు. స్వామివారి ఆశీస్సులతో సంస్థ తరపున సేవలు పొందేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దివ్యాంగులు, వృద్ధులకు చేయూతను అందించిన లైఫ్ మెడికల్ సిస్టమ్స్ నిర్వాహకులకు రెట్టింపు శక్తిని ప్రసాదించేందుకు స్వామిని వేడుకున్నారు. దివ్యాంగుల సొసైటీ జిల్లా అధ్యక్షుడు నరేష్, దివ్యాంగులు రాజేందర్‌రెడ్డి, నాగరాజురెడ్డి, నర్సింగరావు, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండ్లపల్లి భరత్, సుడుగు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వరరాజు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త పడాలి

రామన్నపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్త పడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం. మనోహర్ కోరారు. మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో బుధవారం మునిపంపుల ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రోగుల సమస్యలను వైద్య సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అశ్విని కుమార్, ఎంఎల్‌హెచ్‌పి శాలిని, ఏఎన్ఎంలు ఆదిలక్ష్మి, విజయ ఆశ పాల్గొన్నారు.

టీఎల్ఎంతో బోధన సులభం



అభ్యసన సామగ్రిని పరిశీలిస్తున్న డీఈవో సత్యనారాయణ, ఎంఈవో శరత్‌యామిని

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 20, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల నుంచి తయారు చేసిన బోధనాభ్యసన సామగ్రి(టీఎల్ఎం)తో విద్యార్థులకు బోధించడం సులభమవుతుందని డీఈవో సత్యనారాయణ అన్నారు. బుధవారం గుట్ట పట్టణంలో మండలంలోని ప్రాథమిక పాఠశాలల స్థాయి టీఎల్ఎం మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడానికి అభ్యసన సామాగ్రి ఎంతో దోహదపడుతుందని అన్నారు. మేళాలో ప్రదర్శనల్లో ఉత్తమంగా రూపొందించిన వాటిని జిల్లా స్థాయికి 10(పది) ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో శరత్‌యామిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలి



సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

భువనగిరి రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్త్యాలపల్లిలో ఎస్సీ కాలనీలో పేదల ఇళ్లపై నుంచి వెళ్లిన విద్యుత్ వైర్లను వెంటనే తొలగించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎస్సీ కాలనీలో ఇళ్లపై నుంచి వెళుతున్న విద్యుత్ వైర్లను తొలగించాలని బాధితులు సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. మౌలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, నాయకులు ఎల్లయ్య, రమేశ్, నర్సింహ, రవి, మహేందర్ పాల్గొన్నారు.

మల్లారెడ్డి కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

రామన్నపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన మల్లికార్జున స్కూల్స్ అధినేత మారేపల్లి మల్లారెడ్డి మాతృమూర్తి ఇటీవలే అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగుల రాజిరెడ్డి, జెల్ల వెంకటేష్, గుత్తా నర్సింహారెడ్డి, ఎర్ర శేఖర్‌గౌడ్, సాగర్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, గురజాల రాంరెడ్డి పాల్గొన్నారు.

విశ్వనాథ్‌కు డాక్టరేట్

తుర్కపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామానికి చెందిన ఎర్రగుంట విశ్వనాథ్‌కు బ్రెస్ట్ క్యాన్సర్ పై చేసిన పరిశోధనలకు గాను డాక్టరేట్ అవార్డ్‌తో పాటు జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. గ్రామానికి చెందిన ఎర్రగుంట విశ్వనాథ్ ఉస్మానియా యూనివర్సిటీలో ఉంటూ నాలుగు సంవత్సరాల పాటు బ్రెస్ట్ క్యాన్సర్ చికిత్సలో నూతన మార్గాలను అన్వేషించారు. ఫార్మసి, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగాల్లో ఆయన విశ్లేషణాత్మకంగా చేసిన సాంకేతిక, సుస్థిర పరిశోధనలకు గాను డాక్టరేట్ పట్టాను అందుకున్నారు.

బుషిపాక గణేష్‌కు ..

మోత్కూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండలం ముషిపట్ల గ్రామానికి చెందిన బుషిపాక గణేష్ ఉస్మానియా యూనివర్సిటీనుండి డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటిలో వాణిజ్యశాస్త్రం డిపార్ట్‌మెంట్‌లో కృష్ణచైతన్య పర్యవేక్షణలో 'దళితుల యొక్క సామాజిక, ఆర్థిక జీవనం, స్వయం ఉపాధి, దళితులకు దళిత బంధు ఎలా ఉపయోగపడింది' అనే అంశంపై పిహెచ్‌డీ పూర్తి చేసినట్లు తెలిపారు.

విజయలక్ష్మికి..

మోత్కూరు మునిసిపాలిటి కేంద్రానికి చెందిన డాక్టర్ విజయలక్ష్మి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు. ఫార్మసీ విభాగంలో ప్రొఫెసర్ ఏకృష్ణశైలజ మార్గదర్శకత్వంలో చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించినట్లు తెలిపారు.

పాఠశాల ప్రహరీ పనులను త్వరగా పూర్తి చేయాలి



పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి

తుర్కపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను నాణ్యతాప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని మాజీ సర్పంచ్ గుండెబోయిన కృష్ణమూర్తి అన్నారు. తుర్కపల్లి మండలం ముల్కలపల్లి ఉన్నత పాఠశాలలో రూ.5లక్షల రూపాయల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టనున్న ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. పాఠశాలలో ప్రహరీ లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని, నిధులు మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మంజుషరాణి, యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు గుండెబోయిన బాలు యాదవ్, నాయకులు కోట బిక్షపతి, కొమురయ్య, బొడ్డు బాల్‌నర్సింహ, గనేశ్, మహేశ్, మల్లెబోయిన కుమార్, ఉపాధ్యాయులు చిందం మహేశ్, స్వామి, కవిత, సుబాషిణి విద్యార్థులు ఉన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం



ఆత్మకూరు(ఎం): రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రామన్నపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయమని పలువురు పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక రాజీవ్ గాంధీ చౌక్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోదాసు పృథ్విరాజ్, మొహ్మద్ నాసర్, వనం చంద్రశేఖర్, మొహ్మద్ రెహన్, మొహ్మద్ అక్రం, సాల్వేర్ లింగం, కొత్తపల్లి అబ్రహం కుమార్, గురజాల అంజిరెడ్డి, కోట సుధాకర్, కేశవదాస్ వెంకటేశం, ఆముద లక్ష్మణ్, అనంత కుమార్, శివ, మేడి శంకరయ్య పాల్గొన్నారు.

వలిగొండ: మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కంకల కిష్టయ్య, మాజీ ఎంపీపీ నూతి రమేష్‌రాజు, బడుగు సత్యనారాయణ, నాయకులు సహదేవ్, రవీంద్ర, సురేందర్, సత్తిరెడ్డి, వెంకటేశం పాల్గొన్నారు.



ఆలేరులో కేక్ కట్‌చేస్తున్న మహిళా నాయకులు

తుర్కపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధానావతు శంకర్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు యెలుగల రాజయ్య, నాయకులు చాడ భాస్కర్‌రెడ్డి, ధనావతు మోహన్‌బాబు, రామగోని వెంకటేష్ గౌడ్, సొన్నాయిల రఘు, వల్లపు రమేశ్, రాజు, హనుమంతు, శ్రీకాంత్‌నాయక్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వంగూరి పాండు, ప్రధాన కార్యదర్శి గునిగంటి వెంకటేష్‌గౌడ్, కార్యదర్శి కుక్క కుమార్, కీర్తి సంజీవ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గ్యార సందీప్, జనరల్ సెక్రటరీ జయసూర్య, మహేష్, నవీన్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై. లక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ ఎం.సిద్దులు, సింగిల్ విండో చైర్మన్ జె.శేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదగిరి, జె.నగేష్, పి.మల్లేశం, టి.శ్రీశైలం, డి.భాస్కర్, వెంకన్న పాల్గొన్నారు.

మోటకొండూరు :మండల కేంద్రంలో నిర్వహిం చిన కార్యక్రమంలో మండల నాయకులు భాస్కరుని రఘునాథరాజు, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తండ పాండురంగయ్యగౌడ్, జిల్లా నాయకులు భూమండ్ల శ్రీనివాస్, కొంతం మోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బుగ్గ కొమురయ్య, మాజీ సర్పంచ్ శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, మల్లేష్‌గౌడ్, ఇస్తారి ఉన్నారు.

ఆలేరు: పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి పల్లె శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. భారతదేశ అభ్యున్నతికి ప్రధానిగా రాజీవ్‌గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థినులకు నాప్కిన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లక్ష్మి, దాసరి మంజుల, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర సెక్రటరీ పడమటి పావని, జిల్లా సెక్రటరీలు జాలపు వనజారెడ్డి, కవిత, మండల నాయకులు పాము అనిత, లక్ష్మి ఉన్నారు.

పరమాత్ముడిని ఆరాధిస్తే శుభాలు



శతరుద్ర శివలింగాలకు పూజలు చేస్తున్న సిద్ధగురు రమణానంద మహర్షి

భువనగిరి రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): భక్తితో పరమాత్ముడిని ఆరాధిస్తే సకల శుభాలు కలుగుతాయని సిద్ధగురు రమణానంద మహర్షి ఉద్బోధించారు. బుధవారం మండలంలోని నాగిరెడ్డిపల్లి శివారులో గల శివశక్తి శిర్డీసాయి అనుగ్రహ పీఠం రమణేశ్వరంలో శతరుద్ర శివలింగాల ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉరుకులు, పరుగులతో జీవనం కొనసాగిస్తు కుటుంబ భారం, మానసిక ఒత్తిడిలతో మానవులు భగవంతుడిని స్మరించడం తగ్గుతోందన్నారు. సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు రమణేశ్వరంలో శివలింగాలను ప్రతిష్ఠిస్తున్నట్లు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వలిగొండ: నాగారంలో శానిటేషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో జలంధర్‌రెడ్డి

భువనగిరి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన భద్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని పలువులు అధికారులు అన్నారు. భువనగిరి పట్టణంలో వంద రోజుల ప్రణాళిక విజయవంతంగా కొనసాగుతోంది. 80వ రోజు మంగళవారం భువనగిరి మునిసిపల్ పరిధిలోని 3, 5, 8, 10, 21, 34, 35 వార్డుల్లో పలు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. వీధులు, మురికి కాల్వలను శుభ్రం చేసి మురికి నీటి గుంతలలో ఆయిల్ బాల్స్ వేసి రసాయనాలు స్ప్రే చేశారు. దోమల నివారణకు అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ జి.రామలింగం సూచించారు.

మోత్కూర్: మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మోత్కూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమంత్‌కుమార్ మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలన్నారు. సమావేశంలో మనిసిపల్ కమిషనర్ కె.సతీష్‌కూమార్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభ జస్టిస్, ప్రోగ్రాం కన్వీనర్ పి.ఈశ్వర్ రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.నర్సింహారెడ్డి, స్టూడెంట్ కమీషనర్ సీహెచ్.లింగస్వామి, యాంటీ డ్రగ్స్ కన్వీనర్ సీహెచ్.అంజయ్య, అధ్యాపకులు పి.విజయలక్ష్మీ, యం. భగ్యలక్ష్మీ, ఎం.సుజాత, వై.నర్సిరెడ్డి, సతీష్, శ్యాంమ్, హరికృష్ణ పాల్గొన్నారు.

ఆలేరు: ఆలేరు మున్సిపల్ పరిధిలోని 11, 12 వ వార్డుల్లో 'సీజనల్ వ్యాదులు వాటి నిర్మూలనపై నిర్వహించిన అవగాహన సదస్సులో మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ సరిత మూడవత్ మాట్లాడారు. తాజా ఆహార పదార్థాలు మాత్రమే తీసుకోవాలని, ఇం టి ఆవరణలో నీరు నిల్వకుండా చూసుకోవాల న్నారు.

వలిగొండ: పారిశుధ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మనోహర్ సూచించారు. మండలంలోని నాగారం గ్రామంలో శానిటేషన్‌ను పరిశీలించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుమన్‌కళ్యాణ్, సాయి శోభ, వైద్యాధికారి జ్యోతి, తహసీల్దార్ దశరథ, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

భువనగిరి ఖిల్లా అభివృద్ధికి రూ.53కోట్లు

(5వ పేజీ తరువాయి)

రోప్‌వే నిర్మిస్తారు. కేబుల్ కార్లుగా కూడా పిలువబడే ఈ పనులకు గుర్తించిన స్థలాల్లో పిల్లర్లు నిర్మించి రెండు తీగల ఆధారంగా రోప్‌వే ప్రయాణాలు సాగుతాయి. రూ.30కోట్లతో పిలిచిన సివిల్ పనుల ప్యాకేజీలో ఖిల్లా ముందు భాగం నల్లగొండ రోడ్డు వెంట ప్రస్తుతం ఉన్న ప్రహరీని, గేటు, టికెట్ కౌంటర్ తొలగించి చారిత్రక కట్టడాల శైలిలో పునర్నిర్మిస్తారు. ఖిల్లా పైభాగంలోని రాణి మహల్‌కు అదే డిజైన్‌లో నూతన రూపం ఇస్తారు. మెట్లు లేని ప్రదేశంలో ఖిల్లాను తొలచి మెట్లు ఏర్పాటు చేస్తారు. ఎంపిక చేసిన ప్రదేశాల్లో క్యాంటిన్, గ్రీనరీ, రీ క్రియేషన్ జోన్, కోట గోడ, ఇతర భవనాలకు మరమ్మతులు, నూతన పనులు చేపడత్తారు. ఖిల్లా అంతటా విద్యుత్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. తాగు నీరు, మూత్రశాలలు తదితర మౌలిక వసతులు కల్పిస్తారు. రోప్‌వే బేస్ క్యాంప్ నిర్మిస్తారు. నల్లగొండ రోడ్డులోని ప్రస్తుత ద్వారం నుంచి ఖిల్లావెంట బైపాస్ రోడ్డు వైపునకు సీసీ రోడ్డు, పార్కింగ్ జోన్ ఇతర పనులు చేస్తారు.

కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా చంద్రయ్య

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మాధవనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గంజి చంద్రయ్య, గౌరవాధ్యక్షులుగా యంబ యాదగిరి తోపాటు నూతన కార్యవర్గాన్ని బుధవారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఎన్నికకు పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు శ్రేష్ఠి, ఉపాధ్యక్షుడు అంకం మురళి, చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవ కుమార్, మద్దెలమ్మదేవాలయం కమిటీ అధ్యక్షుడు సూరపల్లి రాము, చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు అంకం పాండు, మహాజన సంఘం సభ్యుడు గంజి అంజయ్య సమక్షంలో సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షులుగా యంబ యాదగిరి, అధ్యక్షులుగా గంజి చంద్రయ్య, పెద్దమ్మతల్లి దేవాలయం అధ్యక్షు డిగా మిర్యాల కృష్ణమూర్తిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ, దేవాలయం అభివృద్ధికి కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. నూతన కార్యవర్గంతో పద్మశాలి సమాజన సంఘం అధ్యక్షుడు శ్రీరాములుశ్రేష్ఠి ప్రమాణస్వీకారం చేయించారు.

విద్యార్థులకు టై, బ్యాడ్జి, బెల్టులు ప్రదానం



విద్యార్థులకు టై, బెల్టులు ప్రదానంచేస్తున్న పేరెంట్ కమిటీ అధ్యక్షుడు భానుప్రకాష్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోన ముక్తాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు టై, బ్యాడ్జీ, బెల్టులను ఐడీ కార్డులను పేరెంట్ కమిటీ అధ్యక్షులు ఏనుగు భానుప్రకాష్ రెడ్డి బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పంతులు మధుబాబు, మాజీ కౌన్సిలర్ కొంగరి కృష్ణ, మాజీ సర్పంచు కొండమడుగు ఎల్లమ్మ మైసయ్య, మాజీ వార్డు సభ్యులు బండారు ప్రకాష్‌రెడ్డి, రాంరెడ్డి, కుక్కలి మహేష్, కుక్కలి జంగయ్య పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



వలిగొండ: గోకారంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

భువనగిరి గంజ్/వలిగొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాలోని పలుచోట్ల సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. భువనగిరి సింగన్నగూడెం చౌరస్తాలో అండర్‌పాస్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ కోరారు. జిల్లా కేంద్రంలోని బుధవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అండర్ పాస్ బ్రిడ్జి మంజూరై పది నెలలు కావస్తున్న ఇంతవరకు పనులు ప్రారంభించలేదని అధికారుల పాలకులు నిర్లక్ష్యమని పేర్కొన్నారు. వెంటనే పనులు చేపట్టి ప్రజలను ప్రాణాలను కాపాడాలని లేని పక్షంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, సభ్యులు చింతల శివ, కొలుపుల కృష్ణ, ఎనబోయిన లింగమూర్తి, చింతల సత్యనారాయణ, మద్ది నరసింహ, మన్నే రమేష్, మన్నే రాజు, వెంకటేశం పాల్గొన్నారు.

- బీటీ రోడ్డుకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య, మండల కార్యవర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వలిగొండ మండలంలోని గోకారం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో గుంతలమయమైన రోడ్డు వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 20 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టడకపోవడం దారుణమన్నారు. స్థానిక ఎమ్మెల్యే బీటీ రోడుడ్డ మరమ్మత్తులపై తగిన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సురేష్, వెంకటేశం, రామస్వామి, ఈశ్వరమ్మ, శంకరయ్య, యాదయ్య, ఎల్లయ్య, భాస్కర్ పాల్గొన్నారు. గోపరాజుపల్లి నుండి వేములకొండకు మెటల్ రోడ్డును నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. గోపరాజుపల్లిలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గుంతలమయమైన రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నర్సింహ, రామలింగం, లింగయ్య, యాదిరెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

తుర్కపల్లి: మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో వార్డులు పర్యటించి సమస్యలపై కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు పోతరాజు జహంగీర్‌కొక్కొండ లింగయ్య, గడ్డమీది నర్సింహ, తలారి మాతయ్య, ఆవుల కళమ్మ, బిచ్చాల సంతోష్, ఆవుల మహేశ్, బారతమ్మ, అశోక్, కళమ్మ, మాధవి ఉన్నారు.